# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

DECEMBER - 1998

# సంక్షిప్త వార్తలు

1998 నవంబరు 2వ తేదీనాడు జాషువా గూటం గారు సతీ సమేతముగా ఢిల్లీ వెళ్లి అక్కడ సంఘమును, సహోదరులను దర్శించిరి. అప్పటకి అమెరికానుండి ఢిల్లీ చేరుకొనిన సోదరులు జె.సి.ఛోట్ గారితో సత్యవాణి రేడియో కార్యక్రమముల విస్తరణను గూర్చి చర్చించిరి. మరలా 8వ తేదీనాటికి వారు కాకినాడ క్షేమముగా చేరుకొనిరి.

నవంబరు 10వ తేదీ మంగళవారం నాడు ఖమ్మం జిల్లా బండారుగూడెం లోని సంఘము వారి నూతన ఆలయము యొక్క రెండవ వార్షికోత్సవము జరుపు కొనిరి. ఆనాటి కూటములో సోదరులు ఇందుపల్లి ఇశ్రాయేలు గారు (తిరువూరు) చక్కటి వాక్యోపదేశము గావించగా సోదరులు డి.దాస్, యస్.సమూయేలు, పి.విజయకుమార్ గార్లు ప్రార్థనలు చేయుటలో సహకరించిరి. వచ్చిన వారందరికీ చక్కటి ప్రేమ విందును స్థానిక సంఘము ఏర్పాటు చేసెను. కూటము అనంతరం ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. బండారుగూడెంలోను మణుగూరు లోను, పరిసర గ్రామములలోను సోదరులు పి.సురేంద్రకుమార్ గారు గొప్ప సువార్త పని చేయుచున్నారు.

కృష్ణా జిల్లా మరియు ఖమ్మం జిల్లాల సువార్తికుల సదస్సు 1998 నవంబరు 23వ తేదీ సోమవారంనాడు కంభంపాడులో క్రీస్తుసంఘ సువార్తికులైన సోదరులు కె.ఇశ్రాయేలు గారి యింటి ఆవరణలో ఘనముగా జరిగెను. ఆ దినము దేవుడు అనుగ్రహించిన మంచి వాతావరణమును బట్టి పలు గ్రామములు, పట్టణముల నుండి వచ్చిన, ఇంచుమించు 120 మంది సువార్తికులతో సదస్సు ఆవరణ అంతయు ఆనందోత్సాహములతో నిండి యుండగా, "రక్షింపబడుటకు విశ్వాసము ఒక్కటి మాత్రమే చాలునా ? విధేయత కూడా అవుసరమా ?" అను అంశము చర్చింపబడెను.

సోదరులు జి.మార్కు గారు (నందిగామ) అధ్యక్షత వహించగా కె.రాజ్‌కుమార్ (విజయవాడ), టి.ప్రసాదరావ్ (మైలవరం) గార్లు ప్రార్థనలలో నడిపించిరి. స్థానిక సంఘ యౌవనస్థులు ఈ సదస్సు నిమిత్తమై ప్రత్యేకముగా ముద్రించబడిన పాటలు పాడి అందరితో కలసి దేవుని స్తుతించుటలో సహకరించిరి. సోదరులు వి.ప్రసాదరావ్ గారు బైబిలు వాక్య పఠనము గావించిరి.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 63722

Editor :

JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 19 డిశంబరు 1998 సంచిక 5


## సంపాదకీయం

## బైబిలు దేవుని వాక్యమై యున్నది

(The Bible is the word of God)

**పరిచయము :** గత సంచికలో దేవుని యొక్క ఉనికి, తత్వములను గూర్చి తెలిసికొని యున్నాము. ఈ రోజు బైబిలు దేవుని వాక్యమై యున్నది యను అంశమును పరిశీలించుదాం.

బైబిలు ఇట్లనుచున్నది : "దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నా డనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6). ఆయన దయచేయుఫలమును గూర్చి మానవుడు అమితమైన ఆసక్తి కలిగియున్నాడనుటలో సందేహము లేదు. పుట్టిన నాటినుండియే గిట్టుట కారంభించువాడు మానవుడు గనుక, అతనికి కొన్ని సహజ కోరికలున్నవి. జంతువులవలె గాక అతడు జీవించాలనే కాంక్ష, మృత్యువు అంటే భయం

కలిగినవాడు. నేనెక్కడినుండి వచ్చాను ? ఇక్కడు ఎందుకు వున్నాను ? ఎక్కడికి వెళ్ళుచున్నాను ? అనేవి అతనిలో సహజంగా ఉద్భవించే ప్రశ్నలు.

అతడు ప్రకృతిని ఆరాధించుట (pantheism)లో జవాబును కనుగొనలేక పోయాడు. తనకు తనసే దేవునిగా చూపించేది ప్రకృతి ఆరాధన. సుఖ సంతోషాలే శ్రేష్ఠమైనవి (epicureanism )అనేది, సన్యాసత్వమే ఆనందదాయమైనది (stoicism) అనేది, ఈ రెండూ ప్రాణాంతకమైనవే. వేదాంతమైతే (theism) దేవుని మైనస్యము గలవానిగ చిత్రీకరించు చున్నది. గనుక మానవుడు అన్వేషితపూరితమైన తన ప్రశ్నలకు జవాబును కనుగొనలేక, జీవించాలనే కోరికతో, మరణం తథ్యం అనే భయముతో సమాధి యొద్దకు పరుగిడుచున్నాడు. అయితే మానవుని నైతిక లక్షణములతో సృజించిన దేవుడు నిస్సహాయుడుగా విడిచిపెట్టక, అతనికి కొన్ని సూచనలిచ్చి యున్నాడు.

బైబిలును దాని బోధలను ఎరిగినవారు, దానియందు విశ్వాసముంచ గోరుదురు. ఒకానొక దినమందు మరణించుట తథ్యమని యెరిగి, వారు మరల జీవించాలని కాంక్షించుదురు. మానవులు మరల జీవింతురని, వారి తదుపరి జీవితము ప్రస్తుత జీవితము కంటె అతి శ్రేష్టమైనదని బైబిలు బోధించుచున్నది. ఇట్టి ఆదరణ కరమైన భావముల వలన అతనిలో మృత్యువు యొక్క భయభీతులు గొప్పగా క్షీణించి పోయాయి. అయితే దేనినో ఒక దానిని నమ్మినంత మాత్రాన దానిని నమ్ముటకు అది సరిపడినంత ఆధారము కాజాలదు. బైబిలు దేవుని వాక్యమనుటకు ఆధారమేమున్నదని విశ్వాసి తరుచు ప్రశ్నింపబడతాడు. "విశ్వాసము వలన నేను నమ్ముచున్నానని" అతడు జవాబీయవచ్చును. అయితే అవిశ్వాసియైన వాడు కూడ నమ్ముటకు కావలసినంత ఆధారములు, లేక ఋజావులు లేకపోలేదు. నిజమైన "విశ్వాసము నిరీక్షింపబడు వాటియొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజావునైయున్నది" (హెబ్రీ 11:1). అందువలన అది గ్రుడ్డిది కాదు గాని హేతుబద్ధమైన అనేక పునాదులపై ఆధారపడి యున్నది.

## 1. బైబిలు తన్ను గూర్చి చెప్పుకొను సంగతులు

"దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము....." 2తిమోతి 3:16

"మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగా పలికిరి......." 2పేతురు 1:20,21

"యిర్మీయాకు ప్రత్యక్షమైన యెహోవా వాక్కు...." యిర్మీయా 14:1

"యెహోవా, నీ వాక్యము ఆకాశమందు నిత్యము నిలకడగా యున్నది..." కీర్తన 119:89

"నీ శాసనములు ఆశ్చర్యములు, కావుననే నేను వాటిని గైకొను చున్నాను" కీర్తన 119:129

-క్రీస్తు పాత నిబంధనలోని వాక్యములనెత్తి చెప్పుచువాటిని దేవుని వాక్యమని చెప్పెను (యోహాను 10:35; మత్తయి 4:1-10; 5:17,18). ఆయన తానే లేఖనముల యొక్క నెరవేర్పని చెప్పెను.

-క్రొత్త నిబంధన కూడ లేఖనమని చెప్పబడెను. పౌలు యొక్క వ్రాతలు లేఖనమని చెప్పబడెను (2పేతురు 3:15,16).

## 2. బైబిలు దేవుని వాక్యమని నమ్ముటకు గల కారణములు

దాని పృష్టమైన ఆరంభము : బైబిలు ఈ లోకంలో యున్నది. అయితే అది ఇక్కడకు ఏలాగు వచ్చింది ? ఎక్కడనుండి వచ్చింది ? మానవుల నుండియా? ఈలోకంలో రెండు రకాల మానవులున్నారు - సజ్జనులు, దుర్జనులు. సత్పురుషులు బైబిలును వ్రాసి దాని ద్వారా అబద్ధమాడజాలరు. ఏలయనగా "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడని" అందులో వ్రాయబడియున్నది. కాబట్టి అది వారి కల్పన కానేరదు. దుర్జనులు దానిని వ్రాసియుండలేరు. ఏలయనగా బైబిలు నీతి విధులను ఆజ్ఞాపించుచు, పాపమును ఖండించుచు, వారి ఆత్మలనే నిత్య శిక్షకు గురిచేయు

చున్నది. అందువలన బైబిలు మరొక స్థావరము నుండి, ప్రాకృతిక ప్రపంచమునకు అతీతమైన స్థావరమునుండి కలిగియుండెను. ఆ స్థావరమే దేవుడు!

దాని ఆశ్చర్యకరమైన ఐక్యత : బైబిలులో రెండు ముఖ్య భాగములున్నాయి. పాతనిబంధన, క్రొత్తనిబంధన. పాతనిబంధనలో 39 క్రొత్తనిబంధనలో 27 పుస్తకములున్నాయి. ఇవన్నియు ఇంచుమించు 1600 సంవత్సరముల కాలములో 40 మందిచే వ్రాయబడ్డాయి. వారిలో అనేకులు ఒకరినొకరు ఎరిగిన వారు కారు. అయినను వారు వ్రాసిన దానంతటిలోను గొప్ప పరిపూర్ణమైన పొందిక యున్నది.

దేవుని గూర్చియు, మానవుని గూర్చియు, పాపమును గూర్చియు, రక్షణను గూర్చియు ఏకత్వము గల బోధ దానిలో యున్నది. మానవుని కనుగొని, అతనితో స్నేహించి, అతనికి మేలుచేసి పాపము నుండియు మరణమునుండియు అతని విమోచించుటయే దాని ముఖ్య ఉద్దేశ్యము.

దానితత్వమంతా పాపమును ద్వేషించి పాపిని ప్రేమించుటయే.

దానిలోయున్న ప్రవచనముల నెరవేర్పు :

| ప్రవచనము | దాని నెరవేర్పు : |
|---|---|
| - బబులోను నాశనము చేయబడును (ఇది నమ్మశక్యము కానిది. ఏలయన ఆ దినములలో బబులోను గొప్ప బలమైన పట్టణము). (యిర్మియా 51:58; 50:26). | మరెన్నడు నివాస యోగ్యము కానిరీతిగా బబులోను నాశనము గావించబడెను. |
| - యెరూషలేము నాశనము చేయ బడును (ద్వితీయో. 28వ అధ్యా). | 1500 సంవత్సరముల తరువాత బైబిలు చెప్పిన రీతిగనే అది నాశనము చేయ బడెను. |
| - యెరికో పట్టణమును తిరిగి నిర్మించువాని జ్యేష్టకుమారుడు, కనిష్ట కుమారుడు మరణించును (యెహోషువ 6:26). | 500 సంవత్సరముల తరువాత ఖచ్చితముగా ఆలాగే జరిగెను. 1రాజులు 16:34. |

| | |
|---|---|
| - రోబోవు క్రీస్తు తృణీకరింపబడును, విసర్జింపబడును (యెషయా 53:3). | యేసు తృణీకరింపబడెను, విసర్జింపబడెను. లూకా 23:18. |
| - మనయతిక్రమములను బట్టి ఆయన నలుగ గొట్టబడును (యెష 53:3). | యేసును నలుగ గొట్టిరి. లూకా 22:63-64. |
| - ఆయన పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగును (యెషయా 53:5). | యేసు శ్రమ పొందెను. యోహాను 19:1-4. |
| - బాధింపబడినను ఆయన నోరు తెరువడు (యెషయా 53:7). | యేసు నోరు తెరువలేదు. లూకా 23:9. |
| - అతిక్రమము చేయబడిన వారిలో ఎంచబడును, గొప్పవాని సమాధిలో యుంచబడును (యెషయా 53:12). | యేసు దొంగల మధ్య సిలువ వేయబడెను. ధనవంతుని సమాధిలో యుంచబడెను. లూకా 23:50-53. |
| - ఆయన బేత్లెహేములో జన్మించును (మీకా 5:2). | యేసు బేత్లేహేములో జన్మించెను మత్తయి 2:4-6. |
| - ఆయన కన్యకు జన్మించును (యెషయా 7:14). | యేసు కన్యకకు జన్మించెను. మత్తయి 1:23-25. |

పాతనిబంధనలో చేయబడిన ఇట్టి వందలాది ప్రవచనములు క్రొత్త నిబంధనలో నెరవేర్చబడుట మనము చూడగలము. అవి నెరవేరుసరికి కనీసము 400 సంవత్సరములకు ముందే చెప్పబడెను. కొన్ని 800, మరికొన్ని వెయ్యి సంవత్సరములకు ముందే చెప్పబడినను అక్షరాల నెరవేరెను. యివి దేవుని హస్తము వలన నెరవేరెను. మానవుడు భవిష్యత్తును గూర్చి చెప్పలేడు; దానిని స్వాధీనపర్చుకోలేడు.

దేవుని సహాయత లేకుండా మానవుడు బైబిలును వ్రాసియుండలేడు: బైబిలు మానవునినుండియే కలిగినట్లయిన ఏదో ఒక కాలములో కొందరు దానిలో ఈపాటికి ప్రావీణ్యత సంపాదించి యుందురు. అయితే అన్నియుగాలలో యున్న గొప్ప పండితులలో ఎవడును దానిలో ప్రావీణ్యత సంపాదించలేకపోయాడు.

మానవుడు చేసిన దానిని వేరొకడు చేయగలడు; అంతకన్నా బాగుగా చేయగలడు. బైబిలు మానవుని నుండియే కలిగినట్లయితే, గత అనుభవమును బట్టి అటువంటి గ్రంధాన్ని, దానికంటే శ్రేష్టమైన దానిని ఈ పాటికే తయారుచేసి యుండగలుగును. అయితే బైబిలుకు దగ్గరగా యున్న గ్రంధమునెవడు ఇప్పటికింకా తయారుచేసి యుండలేదు.

దాని మానవాతీతమైన నిష్పక్షపాతము : బైబిలులో వాస్తవములు నిష్పక్ష పాతముగ లిఖించబడినవి. యిది దాని యొక్క ముఖ్య లక్షణము. మానవుని సదలవాట్లు, దురలవాట్లు కూడ అందు పొందుపరచబడినవి. అందునుబట్టి బైబిలు గొప్ప విశిష్టతను సంతరించుకొన్నది. మానవుడెవడైనా తన స్వీయ చరిత్రను వ్రాసుకొనేటప్పుడు అతని విజయములతో కలసి అతని పొరబాట్లను కూడా వ్రాసుకొనడు గదా.

- ఆదాము పాపము చేసెను. ఏదెను నుండి తరిమి వేయబడెను.
- నోవహు త్రాగి తందనాలాడెను.
- దావీదు యొక్క కామాతురత బట్ట బయలు చేయబడెను.
- పేతురు పిరికి పందవలె తన ప్రభువునే ఎరుగనని బొంకెను.

దేవుని గూర్చిన దాని బోధ : బైబిలు యదార్ధమని నమ్ముటకు యూదులే ఒక గొప్ప తార్కాణమని చెప్పవచ్చును. యూదులు లేక ఇశ్రాయేలీయులు ఒక ప్రత్యేకమైన జనాంగము. వారు ఒకే ఒక్క దేవుని ఆరాధించే ప్రజలు. లేఖనములలో ఏకైక దేవుని గూర్చియే చెప్పబడింది. అయితే ఇశ్రాయేలీయుల కాలమునాటి లోకమంతా అనేక దేవుండ్ల నారాధించేవారు. అయినను సరే ఇశ్రాయేలీయులు నాటి లోకాచారములకు ప్రభావితులు కాకుండా ఏకైక దేవునినే ఎందుకు ఆరాధించే వారు ?

ఐగుప్తీయులు పలు దేవుండ్లను సృజించుకొని ఆరాధించేవారు. అయితే ఇశ్రాయేలీయులు ఏకైక దేవుని ఆరాధన వారి స్వీయ సంకల్పము కాదు. వారు పలుమార్లు దానినుండి తొలగిపోయారు. అయినను బైబిలులో బయలుపరచ

బడిన ఏక దేవుని ఆరాధనలోనే వారు కొనసాగారు. వారెప్పుడు బహు దేవతార్చనలో పడ్డారో అప్పుడు ఖండించబడేవారు, దేవునిచే శిక్షించబడేవారు. అందువలన ఏక దేవుని ఆరాధన నాడున్న మతాచారములనుండి ఉద్భవించినది గాక, ప్రకృతికి అతీతముగా యున్న స్థావరమునుండి, దేవునినుండి ఉద్భవించినట్టిది.

దాని భౌగోళిక స్థల వర్ణన సమాచారము సరియైనది : ఈ విషయాల్లో సరియైన సమాచారము నందించుట ఆనాటి లేఖకులకు యాత్రికులకు కష్టతరమైన సంగతే. అయితే పాతనిబంధన యొక్కయు, క్రొత్తనిబంధనయొక్కయు లేఖకులు ఈ విషయాల్లో ఎన్నడు పొరబడలేదు. వారు "యెరూషలేముకు ఎక్కి వెళ్లిరి", "గాజాకు దిగిపోయిరి", "యెరికోకు దిగిపోయిరి" అని బైబిలు చెప్పినప్పుడు అది భౌగోళికంగా యదార్థమైన సమాచారమే.

విజ్ఞానశాస్త్ర సంబంధమైన సంగతులను బైబిలు ముందుగనే ఎరిగి యుండెను:

- క్రీస్తు పూర్వము 150వ సంవత్సరములో హిప్పార్కస్ అనునతడు నక్షత్రములను లెక్కించి ఈ విశ్వమంతటిలోను 1022 నక్షత్రములు మాత్రమే యున్నవని ప్రకటించెను.

క్రీ॥శ॥ 120లో టోలెమి అనునతడు 1026 నక్షత్రములను లెక్కించెను. ఈనాడైతే మిక్కలి శక్తివంతమైన ఖగోళదర్శిని (Telescope) ద్వారా 40 కోట్ల వరకు నక్షత్రములను లెక్కింపవచ్చును. అయితే శాస్త్రజ్ఞుల అంచనా ప్రకారము కోట్లాదికోట్ల నక్షత్రములున్నవి. అవి మానవునికి లెక్కింపనశక్యములు అని వారు చెబుతారు. అయితే బైబిలు ఇదే సంగతిని వేలాది సంవత్సరములనుండి చెప్పుచున్నది. ఆదికాండము 15:5; 22:17 లను చదువండి.

- ఈ భూమి గుండ్రముగా యున్నదని శాస్త్ర యుక్తముగా నిరూపింపబడినది. అయితే 15వ శతాబ్దము వరకు భూమి బల్ల పరుపుగా యున్నదని ప్రజలు భావించారు. మానవుడు భూమి చుట్టు సముద్ర యానము చేయక రెండువేల సంవత్సరములకు ముందునుండే భూమి గుండ్రము

యున్నదని బైబిలు చెప్పుచున్నది. "ఆయన భూమండలము మీద ఆసీనుడై యున్నాడు. దాని నివాసులు మిడతల వలె కనబడు చున్నారు" అని యెషయా 40:22లో చెప్పబడియున్నది. ఈమాటలను వ్రాసిన లేఖకునికే వాటి అర్థము ఆనాడు తెలిసియుండక పోను. భూమి గుండ్రముగా యున్నదని ఇప్పుడు నిరూపింపబడిన తరువాత, దేవుడు తన గ్రంథములో బయలుపరచిన దానికిని మానవుడు కొనుగొనిన సత్యమునకును గొప్ప సమైక్యత యున్నట్లు చూడగలము.

- భూమి దేనిపై ఆధారపడియున్నదో అను అంశముపై ప్రజలలో అనేక భావములుండేవి. అట్లాసు అనేవాడు భూమిని తన భుజములపై మోయు చున్నాడని, అష్ట దిగ్గజములు దీనిని మోయుచున్నవని రకరకాలుగా ప్రజలు భావించేవారు. అయితే బైబిలు మాత్రము దేవుడు "భూమిని శూన్యముపైని వ్రేలాడచేసెను" అని చెప్పుచు వచ్చింది (యోబు 26:7).

- భూమికి ఉత్తరముగా గొప్ప ఆకాశ విశాలమును శాస్త్రజ్ఞులు ఈ మధ్యనే కనుగొన్నారు. దానిలో నక్షత్రములు గాని, గ్రహములు గాని యేమీలేవు. ఈ సమాచారం బైబిలులో ఎప్పుడో వ్రాయబడియున్నది. "శూన్య మండలము పైని ఉత్తర దిక్కునున్న ఆకాశ విశాలమును ఆయన పరచెను" అని అది చెప్పుచున్నది (యోబు 26:7).

పురావస్తు శాస్త్రము బైబిలు యదార్థతను ఘోషించుచున్నది :

- సొదొమ గొమొర్రాలను పట్టణాలంటూ యేమీలేవని కొందరు అనుమానించేవారు. అయితే మృత సముద్రమునకు దిగువ ఆ పట్టణములు కొనుగొనబడెను.
- యెరికో పట్టణ గోడలు కూలిపోయినట్లును, బైబిలు చెప్పుచున్నట్లే అవి వెలుపలికి కూలిపోయి యున్నట్లును కనుగొనబడెను.

-నీనెవె అనే పట్టణం లేదని కొందరు చాల కాలం అనుమానించారు. గాని ఇప్పుడు దాని శిధిలాలు కనుగొనబడ్డాయి.

-1872లో బ్రిటీషు మ్యూజియంకు చెందిన జార్జిస్మిత్ అనునతడు, బబులోను రాతిపలకలను కనుగొనెను. అవి నోవహు నాటి గొప్ప జలప్రళయమును గూర్చి చెబుతు బైబిలు యదార్థమును ఘోషించు చున్నవి. అవి క్రీ॥పూ. 688 - 626లో వ్రాయబడెను. ఇట్టి గొప్ప వాస్తవములను పురావస్తు శాస్త్రజ్ఞులు దినదినము త్రవ్వుచు వెలికి తీయుచు బైబిలు మానవచరిత్ర యొక్క నమ్మతగిన గొప్ప రికార్డు అని నిరూపించు చున్నారు.

దాని శత్రువులపై బైబిలు యొక్క ప్రభావము గొప్పది :

-క్రీస్తుశకము 3వ శతాబ్దము అంతమగుసరికి రోమా చక్రవర్తి యగు డయొక్లేషియన్ బైబిలుపై ఎనలేని పోరాటము సలిపాడు. రెండు సంవత్సరముల మట్టుకు అతడు బైబిళ్లను, బైబిలు భాగములను అగ్నికి ఆహుతి చేయుచు, వాటి బూడిదపై ఒక గొప్ప స్మారక చిహ్నమును నిలబెట్టి దానిపై "క్రైస్తవుడను నామము సమూలముగా నాశనము చేయబడింది" (Extincto Nomine Christianorum ) అని చెక్కించెను. ఇరవై సంవత్సరాల తరువాత కాన్‌స్టాంటిన్ అను మరొక రోమా చక్రవర్తి క్రొత్త నిబంధన ప్రతి ఒకటి ఎక్కడైనా దొరుకునా అని విచారించగా 24 గంటలలో అతనికి 500 ప్రతులు అందజేయబడెను! బైబిలు, క్రైస్తవుడు అను నామము డయొక్లేషియన్ మరణించిన 1700 సంవత్సరముల తరువాత కూడ ఇంకా ప్రబలముగనే యున్నవి.

- వోల్టెయర్ అను ఫ్రెంచి నాస్తికుడు ఇక వంద సంవత్సరముల కాలములో బైబిలును ఎవడు జ్ఞాపకముంచుకొనడని డంబముగా ప్రకటించెను. గాని అతడు చనిపోయిన వంద సంవత్సరముల కాలములోనే అతని యిల్లు బైబిలు సరఫరా కేంద్రముగా మారెను.

-అమెరికా జాతీయుడును అజ్ఞాత వాదియగు రోబర్ట్ ఇంగెర్సాల్ అనునతడు బైబిలును చేతబట్టుకొని పదిహేను సంవత్సరములలో బైబిలును శవాల గదిలో పడవేయించెదనని పలికాడు. అయితే పదిహేను సంవత్సరముల కాలములోనే రోబర్ట్ ఇంగెర్సాల్ చనిపోయి శవమాయెను. గాని బైబిలు ఇంకా నిలిచేయున్నది ( మత్తయి 24:35 చదువుము).

-ల్యూవేలెస్అనునతడు బైబిలును కించ పరచగోరినను, బైబిలును సమర్ధించుచు బెన్‌హర్ అను ప్రముఖ నవలన్నురచించెను.

-రూసో అను ఫ్రెంచి నిర్దేవుడు, "లేఖనముల గంభీరత నన్ను ఆశ్చర్య చకితునిగా చేయుచున్నది" యని పలికెను.

**వివిధ భాషలలో లభ్యమగుచున్న బైబిలు :** అనేక గ్రంధాలు ముద్రణలుగా ( Editions) ప్రచురిత మౌతాయి. కొన్ని సంవత్సరాల తరువాత వాటిని కొనేవారి సంఖ్య క్షీణించుటచే అవి యిక ముద్రితముగాక, కనబడకుండా పోతాయి. కొన్ని గ్రంధాలయితే పునర్ముద్రితమవుతూ వుంటాయి. వాటిలో షేక్సిపియర్ వ్రాసిన పుస్తకాలు ఉదాహరణగా మనం చెప్పుకోవచ్చును. అయితే బైబిలు మాత్రం ఎన్నడు ముద్రితం కాకుండా మాయమైపోలేదు. ప్రతి సంవత్సరం లక్షలాది గ్రంధములు ప్రపంచమందంతటా ముద్రిత మవుతూనే వున్నాయి. అంతేకాదు, బైబిలు ఇప్పుడు వెయ్యి భాషలలోను, రెండువేల ప్రాదేశిక భాషలలోను (Dialects) ముద్రితమవుచున్నది. మానవుడు వ్రాసిన ఏ గ్రంధము కూడా ఎన్నడు అన్ని భాషలలోనికి తర్జుమా చేయబడలేదు.

## ముగింపు

పై జెప్పబడిన కారణముల వలనను. ఇంకా అనేక కారణముల వలనను బైబిలు మానవుని నుండి గాక దేవుని నుండియే కలిగినదని నీవు నమ్మవచ్చును. నిష్పక్షపాతి యైన వానికి పైన చెప్పబడిన ప్రతి అంశము యదార్ధమని రుజువగును. ఈ వాస్తవములన్నిటినీ మనం పూసగుచ్చినట్లు గుచ్చితే అవొక పెద్దత్రాడు అగును. బైబిలు మానవ కల్పిత గ్రంధము కాదు. దాని మానవాతీత బయల్పాటులు,

గంభీర సత్యములు సర్వశక్తి మంతుడైన దేవుని యొక్క అమితమైన శక్తి, జ్ఞానము, ప్రేమలను మనకు తెలియజేయుచున్నవి. "ఒకడు తన ఊహను బట్టి చెప్పుటవలన లేఖనములో ఏ ప్రవచనమును పుట్టదని మొదట గ్రహించు కొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగ పలికిరి" (2పేతురు 1:20-21).

## బైబిలుమానవునికి దొరికిన విధానము

## (How the Bible came to Man)

**పరిచయము :** దేవుడున్నాడని, బైబిలు దేవునియొక్క వాక్యమని గ్రహించుకొనడం వేరు; గాని బైబిలు మానవుని యొద్దకు ఎట్లు వచ్చెనో తెలియజేయడం వేరు.

బైబిలును 40 మంది లేఖకులు 1600 సంవత్సరముల కాలములో (క్రీ॥పూ 1500 నుండి క్రీ॥శకము 100వరకు) వ్రాసిరని యిదివరకు చెప్పుకొన్నాము. ఈ లేఖకులందరు గొప్ప విద్యావేత్తలుగాని, పెద్దగా చదువుకొన్నవారు గాని కారని గ్రహించుకొనవలెను. వారు సమాజములో యున్న వివిధ తరగతులకు చెందినవారు-న్యాయవాదులు, గొల్లలు, రాజులు, బేస్తవారు, వైద్యులు, మిషనెరీలు మొదలగువారు. ఇంత వ్యత్యాసముగల వివిధ తరగతులవారు అంత చక్కటి గ్రంథాన్ని స్వవిరుద్ధ సంగతులు లేకుండా, ఒకరినొకరు ఎరుగకుండా వ్రాసారంటే, అదొక గొప్ప ఆశ్చర్యం, దీనిని మనమెట్లు వివరించగలము ?

ఇంకొక ఆశ్చర్యకరమైన సంగతియేమంటే - ఈ లేఖకులందరు ఒకే కాలములో జీవించిన వారు కారు. అందువలన ఒకరినొకరు ఎరిగినవారు కారు; ఒకరు వ్రాసిన దానిని ఇంకొకరు ఎరిగియుండలేదు. అంతకన్నా ఆశ్చర్యమేమంటే వాళ్లు వ్రాసేది వారికే గ్రహింపు లేనట్లుండేది. 1పేతురు 1:10-12 ఈ సంగతిని మనకు విపులీకరించుచున్నది. "వాళ్లు వ్రాసేది వారికే తెలియకపోతే, వాళ్లు ఎట్లు

వ్రాయఁగలిగే వారు ?" అని నీవడుగవచ్చును. 2పేతురు 1:21లో బైబిలు దీనికి జవాబు చెప్పుచున్నది : "... మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగ పలికిరి" ఆ వచనములోని మొదటి భాగంలో [illegible] ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను (జ్ఞానము, ఆలోచన, కోరిక) బట్టి కలుగలేదు అని చెప్పబడింది. గనుక అది మానవుని ఆలోచన వలన, కోరిక వలన, జ్ఞానము వలన కలుగకపోతే, అదెక్కడనుండి కలిగింది ? అది దైవప్రేరణ కలిగిన మనుష్యుల ద్వారా కలిగింది. వారు దానిని లిఖించారు. దానినే దైవావేశము (Inspiration) అని యందురు.

## బైబిలు యొక్క దైవావేశము

బైబిలు తన్నుతాను దైవావేశము వలన కలిగిన గ్రంధమని చెప్పుకొనుచున్నది యని గత పాఠంలో మనము నేర్చుకొన్నాము : "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2తిమోతి 3:16-17).

దైవావేశము (Inspiration) అనుమాట(Inspirare) అను గ్రీకు మాటనుండి ఉద్భవించినది. "లోపలికి ఊదుట" యని దీని యర్థము. లేఖనములు దైవావేశము వలన కలిగినవని యనుటలో అవి దేవునిచే ఊదబడినవి లేదా దేవుని క్రియవలన కలిగినవని మనయభిప్రాయము. దైవావేశము యొక్క వర్ణన 2పేతురు 1:21లో ఇయ్యబడింది. అందువలన బైబిలు మానవకృత్యము కాదు. దాని వర్తమానమును వ్రాసినవారు దేవునిచే నడిపింపబడిరి. దేవుడు మానవునికి వ్రాయించిన వర్తమానము లేక ఉత్తరము అని బైబిలును గూర్చి తలంచవచ్చును. దేవుని చిత్తమును గూర్చి మనలను దేవుడేమి తెలిసికొనగోరుచున్నాడో అదంతయు ఈ విశిష్టమైన గ్రంధములో మనకు కనబడును.

దైవావేశము విషయంలో బైబిలు తనను గూర్చి యేమి చెప్పుకొనుచున్నది? పాతనిబంధన లేఖకులు తమకు అతీతమైయున్న శక్తివలన నడిపింపబడు చున్నామనే నమ్మకము, నిర్ధారణ చొప్పున వ్రాసారు. హెబ్రీ పత్రిక లేఖకుడిట్లు వ్రాసాడు : "పూర్వకాలమందు నానా సమయములలోను, నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాట్లాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను" (హెబ్రీ 1:1-2). యెషయా, యిర్మీయాలాంటి ప్రవక్తలు "ఇదే యెహోవా వాక్కు", "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడని" లిఖించుట మనము గమనించగలము. మిగతా లేఖకులు, ప్రవక్తలు కూడ అదే మాటలను పదే పదే లిఖించారు. "యెహోవా వాక్కు యోనాకు ప్రత్యక్షమై ఈలాగు సెలవిచ్చెను" (యోనా 1:1); "పెతూయేలు కుమారుడైన యోవేలుకు ప్రత్యక్షమైన యెహోవావాక్కు" (యోవేలు 1:1); "ప్రవక్తయగు హబక్కూకునొద్దకు దర్శన రీతిగా వచ్చిన దేవోక్తి" (హబక్కూకు 1:1). ఇవన్నీ వారి వ్రాతల ఉదాహరణలే.

క్రొత్తనిబంధన కూడ దైవావేశము వలన కలిగినదని చెప్పుకొనుచున్నది. పాతనిబంధన ప్రవక్తల బోధలను కనుమరుగు చేయునట్లు యేసుప్రభువు "మోషే ధర్మశాస్త్రములోను, ప్రవక్తల గ్రంధములలోను, కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడినవన్నియు నెరవేరవలెనని నేను మీ యొద్ద ఉండినప్పుడు మీతో చెప్పిన మాటలు నెరవేరినవని వారితో చెప్పెను" (లూకా 24:44). "పూర్వీకులతో చెప్పబడిన మాట మీరు విన్నారు గదా. నేను మీతో చెప్పునదేమనగా"-యని యేసు కొండమీద చేసిన ప్రసంగములో తరుచు పలుకుట మనము గమనించ గలము (మత్తయి 5:21-48). యేసు తన ప్రసంగము చేసి ముగించినప్పుడు "జన సమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుంటిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రుల వలెగాక అధికారము గలవాని వలె వారికి బోధించెను" (మత్తయి 7:28-29).

యేసు శిష్యులలో ఒకడొకసారి, "ప్రభువా, యెవని యొద్దకు వెళ్లుదుము? నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు, నీవే దేవుని పరిశుద్ధుడవని మేము విశ్వసించి యున్నామని ఆయనతో చెప్పెను" (యోహాను 6:68-69).

దేవుని మాటలనే క్రీస్తు పలికెననుటలో సందేహములేదు. ఆయన ఇట్లు చెప్పెను : "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపనివానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్య దినమందు అతనికి తీర్పు తీర్చును. ఏలయనగా నా యంతట నేనే మాటలాడలేదు; నేను యేమనవలెనో, యేమి మాటలాడవలెనో దానివి గూర్చి నన్ను పంపిన తండ్రియే నాకాజ్ఞ ఇచ్చియున్నాడు" (యోహాను 12:48-49). బైబిలు దేవునిమండి కలిగినదని, దైవావేశము గలదాననని చెప్పుకొనుటలో యున్న భావము యిది.

షేక్స్పియర్, మిల్టన్, ప్లేటోలకు కలిగిన ప్రేరణ వంటిది బైబిలు యొక్క ప్రేరణ కాదని గ్రహించుకొనవలయును. వారి వ్రాతలలో స్ఫూర్తి యున్నదని ప్రేరణ యున్నదని ఎవరు కాదనరు. గాని వారిది దివ్య ప్రేరణకాదు. అంటే వారు దైవావేశము కలిగిన వారు కారు. దేవుని తలంపులను మాటలను గాక వారు తమ తలంపులను మాటలనే స్ఫూర్తి కలిగి వ్రాసారు. బైబిలు దైవావేశముచే కలిగినదని చెప్పుటకు గాను బైబిలునే ఎందుకు ఉపయోగిస్తారు? ఇదొక బలహీనతకాదా ? యని కొందరడుగవచ్చును. మాట్లాడువాడు దేవుడే గనుక కాదు అని మనం తప్పక జవాబీయవచ్చును. మాట్లాడువాడు దేవుడు కానియెడల, మానవ కల్పితం దైవికం అని ఈ లోకంలో యున్నది యేదీ నిరూపించలేదు. గత పాఠంలో బైబిలుకు గ్రంధకర్త దేవుడే యని మనం గమనించి యున్నాము.

## పాత, క్రొత్త నిబంధనల లోని పుస్తకములు

బైబిలులో మొత్తం 66 పుస్తకములున్నాయి. పాతనిబంధనలో 39, క్రొత్త నిబంధనలో 27 ఉన్నాయని మనం ఎరుగుదుము. బైబిలులో ఈ పుస్తకాలు ఏలాగు సమకూడాయి? అంతకన్నా ఎక్కువ గాని, తక్కువ గాని ఎందుకు లేవు? Canon అనే ఇంగ్లీషు మాటను ఇక్కడ మనం నేర్చుకోవాలి. కేనన్ అనగా బైబిలులో

సమకూర్చబడిన గ్రంథముల సంపుటి యని అర్థము. ఈ సంపుటిలో చేర్చ బడాలంటే ఆ గ్రంథము ఎట్టిదై యుండాలి ? ఏదైనా ఒక పుస్తకం బైబిలులో భాగంగా ఎట్లవుతాది ? పరిశుద్ధగ్రంథములో చేర్చబడాలంటే ఏ పుస్తకమైనా సరే అది దైవావేశముచే లిఖించబడి, మానవులను నడింపిచుటకు గాను దేవునిచే మానవులకు ఈయబడినదిగా ఎంచబడాలి. బైబిలులోని 66 పుస్తకములు ఈ అర్హతను కలిగి యున్నవి. దేవుని ప్రజల వలన, అంటే పాతనిబంధనలో యూదుల వలన, క్రొత్త నిబంధనలో క్రైస్తవుల వలన ఆమోదింపబడితే, ఆ పుస్తకము బైబిలులో భాగంగా యుండుటకు గొప్ప వీలు కలిగేది, అయితే ఏదో ఒక మానవుల గుంపుగాని, శాఖగాని, మతగురువుల సభగాని బైబిలులో ఏయే పుస్తకాలు చేర్చబడాలో ఎన్నడు నిర్ణయించలేదు. కాలము గడచే కొలదీ దేవుని ప్రజలు సాధారణంగా పరిశుద్ధగ్రంథమని వేటిని ఎంచారో వాటినే ఆయా గుంపులు, సభలు దైవావేశము గలవాటిగా ఎంచారు, అంగీకరించారు.

**పాతనిబంధన :** క్రీస్తుకాలము నాటికే పాతనిబంధన పుస్తకముల సంపుటి స్థిరపరచబడి యుండెను. ఈనాడు మనకున్న 39 పుస్తకములే ఆనాటి పాతనిబంధనలోని పుస్తకములు. క్రీస్తు పూర్వము 400 సంవత్సరములకే ఈ సంపుటి సంపూర్తియై యుండెనని చరిత్రకార్థులు చెప్పుచున్నారు. క్రీస్తు కాలములో జీవించియున్న జోసిఫస్ అను చరిత్రకారుడు, క్రీస్తు పూర్వము 424లో పాలించిన అర్టాగ్జెరెక్సెస్ (Artaxerxes ) నాటికే పాతనిబంధన పుస్తకముల సంపుటి పూర్తియై యుండెనని పరిశోధించి తెలియజేసెను.జోసిఫస్ పాతనిబంధనను గూర్చి పరిశోధించి తన యభిప్రాయమును ఇట్లు తెలియజేసెను : "అర్టాగ్జెరెక్సెస్ కాలము నుండి మన చరిత్ర లిఖించబడెననుట సత్యమే. అయితే మన పూర్వికుల చరిత్రతో అది సమానమైన అధికారము గలదిగా లేదు. ఏలయనగా ఆనాటినుండి వరుసగా ఉద్భవించిన ప్రవక్తలు నిజముగాలేరు. ఒక జాతిగా మనము చేయునదంతయు ఆ పుస్తకముల కిచ్చు గౌరవము వాటి యదార్థతను చాటించుచున్నది. ఏలయనగా ఇప్పటికే అనేక కాలముల గతించిపోయినను,

వాటికి ఏదైనా కలుపుటకు గాని, వాటినుండి ఏదైనా తీసివేయుట గాని, వాటిలో ఏమైనా మార్పులు చేయుటకు గాని ఎవనికిని ధైర్యము లేదు. అయితే యిది యూదులందరకున్న సహజ లక్షణమే. అదేమంటే ఆ గ్రంధములు దేవుని వలన కలిగిన దేవోక్తులని యెంచి, వాటియందు కొనసాగుచు, అవుసరమైతే వాటికొరకు ప్రాణములను సయితము కోల్పోవుటకు సిద్ధమవుట యూదులకు సహజమే" ( Frank Pock. Page 43,44).

కేథలిక్కుల బైబిలుకు ట్రెంట్ పట్టణములో క్రీ॥శ॥ 1546లో జరిగిన గురువుల సభ (The Council of Trent) కొన్ని పుస్తకములు అదనముగా చేర్చిరి. అవి యూదులచే అంతకు ముందు 1946 సంవత్సరముల మట్టుకు పరిశుద్ధ గ్రంధముగా అంగీకరించబడిన 39 పుస్తకముల సంపుటికి కేవలము అదనముగా చేర్చబడినవే. అప్పటివరకు యూదులు ఎవరు చేయని పనిని యూదులు కాని ట్రెంట్ పట్టణపు గురువుల సభ చేసింది - దేవుని వాక్యానికి మరికొంత కలిపింది (ప్రక 22:18-19 చదువుము).

క్రొత్తనిబంధన : క్రీ॥శ॥ 397లో కార్తేజ్ పట్టణపు సభలో ( The Council of Carthage ) క్రొత్తనిబంధన పుస్తకముల సంపుటిని గూర్చి మొదట ప్రకటింపబడింది. ఆ సభకు ఇప్పుడు క్రొత్త నిబంధనలోయున్న 27 పుస్తకముల జాబితా అందజేయబడెను. అయితే ఈ సభవారు క్రొత్తనిబంధనలో చేర్చబడ వలసిన పుస్తకములను ఎంపిక మాత్రము చేయలేదు. అప్పటికి మూడువందల సంవత్సరములకు పైబడి క్రైస్తవులు దేవుని వాక్యమని అంగీకరించిన పుస్తకములనే వారు సాదరముగా గుర్తించిరి.

ఈ విషయంలో థామస్ అనునతడు ఇట్లనుచున్నాడు : "క్రొత్తనిబంధన పుస్తకముల సంపుటి (Canon ) సమకూర్చుట మందకొడిగా జరిగినను, లిఖిత పూర్వకమైన విశ్వాస ప్రమాణము నంగీకరించుట అపొస్తలుల ఆచరణయై యున్నది, ప్రాధమికమైయున్నది. ఈ పుస్తకములు లిఖింప

బడిన నాటినుండి కూడ అవి దేవుని వాక్యమని క్రైస్తవులందరు భావించేవారు. అవి సేకరింపబడక ముందునుండే అధికార పూరితమైనవి. సంఘ తండ్రులు (పెద్దలు) క్రొత్తనిబంధన లేఖనములను తరుచు ఎత్తి చూపించేవారు. ఆరిజెన్ అనునతడు తన వ్రాతలలో దానిని 17, 922 సార్లు ఎత్తి వ్రాసాడు. జస్టిస్ మార్టిర్, ఐరేనియస్, అలెగ్జాండ్రియా వాసుడైన క్లెమెంతు, ఆరిజెన్, తెర్తుల్లియన్, హిప్పోలిటస్, మరియు యూసిబియస్ అను ఏడుగురు ప్రముఖ గ్రంధకర్తలు 32, 289 సార్లు క్రొత్తనిబంధన వాక్యములను తమ వ్రాతలలో ఎత్తి చూపించిరి. సామాన్య సాహిత్య చరిత్రలో ఇట్టిది మున్నెన్నడు జరుగలేదు. నేటి దినాల్లో పెక్కుమందిచే బైబిలు చదువబడుటయే గాక, క్రైస్తవ యుగారంభమైన కొన్ని శతాబ్దములలోనే క్రొత్త నిబంధన అంతయు ఏకైక సంపుటిగా అంగీకరించబడెను" ( Frank Pack. Page 55 ).

గనుక మొదటి కొన్ని శతాబ్దములలోనే, మానవకృత్యములగు అనేక గ్రంధములున్నను, అవి క్రమేపి విసర్జింపబడగా చివరకు దైవావేశముచే లిఖించబడిన 27 పుస్తకములు క్రొత్త నిబంధనగా మిగిలెను. నేటివరకు ఆ 27 పుస్తకములే క్రొత్తనిబంధనలో యున్నవి. ఈ గ్రంధములు వెలువడగా ఆదిమ క్రైస్తవులు వాటిని దైవావేశ పూరిత లిఖితములని గుర్తించుట వలన ఇది సాధ్యమాయెను.

ఇప్పుడొక ప్రశ్న : రోమన్ కేథలిక్కు సంఘము బైబిలును ప్రారంభించి, దానిలోని పుస్తకములను సేకరించి అవి దైవావేశ పూరితములని ప్రకటించినట్లు చెప్పుకొనుచున్నది. ఇది నిజమా ? యిది నిజమో కాదో తెలిసికొనుటకు 2 తిమోతి 3:16-17ను చూచుకొని కేథలిక్కుల మాటలో ఎంత యదార్ధమున్నదో గ్రహించుకొందాము : "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది".

## బైబిలు భద్రపరచబడిన విధానము

చరిత్రకారుడగు జోసిఫస్ వ్రాసిన మాటలలో, లేఖనముల యెడల యూదులకున్న భక్తి గౌరవములు మనకు వెల్లడియగుచున్నవి. యూదా లేఖకులు తమ పనిలో ఎంత అత్యంత జాగ్రత్త కలిగియుండిరో కేరల్ అను గ్రంధకర్త ఇట్లు తెలియజేయుచున్నాడు :

"ప్రపంచములో యున్న గ్రంధములలో బైబిలు అతి సున్నితముగా భద్రము చేయబడినట్టిది. నమ్మకమైన మనుష్యులు దానిలో యేమీ మార్పులు సంభవించకుడా అనేక శతాబ్దముల తరబడి పలు జాగ్రత్తలు గైకొని దానిని మన కందించారు. పూర్వకాలములో అచ్చుయంత్రములు లేవు. గనుక బైబిలు యొక్క ప్రతులన్నియు చేవ్రాత ద్వారా నకలులు తీయబడేవి. యిది చాల కాలాతీతమైన పని. అయితే చూచివ్రాతలలో దోషములు దొర్లుట సాధ్యమే. గనుక లేశమైనను తప్పులు లేకుండు నిమిత్తము బైబిలు ప్రతులను వ్రాసేవారు ప్రతి పేజీలోని మాటలను, ఆ మాటలలోని మొత్తము అక్షరములను లెక్కించేవారు. అంతేకాదు వారు ప్రతి పేజీలోని మధ్య మాటను, మధ్య అక్షరాన్ని జాగ్రత్తగా గుర్తుపెట్టుకొనేవారు. ఒక పేజీలోని మాటలన్నిటినీ, అక్షరాలన్నిటినీ, జాగ్రత్తగా లెక్కించుచు ఏదైనా ఒక అక్షరము తప్పిపోవుట గాని, క్రొత్త అక్షరము చేర్చబడుట గాని జరుగకుండా జాగ్రత్తపడేవారు. ఏదైనా ఒక పేజీలో పొరబాటు జరిగినట్లు కనుగొనబడితే, వారా ప్రతిని నాశనం చేసేసి, క్రొత్త దానిని వ్రాసేవారు. ఇట్లు చేయుట ద్వారా చదువరులు ఆ పేజీలో ఏ రకమైన మార్పుచేయబడినట్లు గమనించరు. ఈ విధముగా కాపీ చేయబడిన పేజీలు వాటి చివర అంచులనుండి మరొక పేజీ అంచులకు గుచ్చబడేవి. అవన్నీ కలిపి ఒక పొడవైన గ్రంధపు చుట్టగా ఒక కర్రకు చుట్టబడేవి".

"ఈ పుస్తకములు చర్మపు కాగితముల మీద వ్రాయబడేవి. అవి సంవత్సరముల తరబడి పాడుకాకుండా యుండేవి. పూర్వకాలములో వ్రాయబడిన వ్రాతప్రతులు

వందలకొలది ఈనాడు కూడా ఉన్నవి. వీటన్నిటినీ విద్యావేత్తలు నిశితముగా పరిశీలించి పూర్వకాలపు లేఖకులు నకలులు వ్రాయుటలో పొరబాట్లేమీ చేయలేదని ధృవీకరించారు. అయితే వారు కొన్ని సూక్ష్మమైన తప్పులు చేసారు. ఉదాహరణకు: పాలస్తీనాలో ఒక గుహలో కొన్ని బైబిలు గ్రంధపు చుట్టలు కనుగొనబడినవి. శాస్త్రయుక్తముగా పరిశోధనలు జరిపి శాస్త్రజ్ఞులు అవి క్రీస్తుకు 100 సంవత్సరములు ముందు వ్రాయబడెనని నిర్ధారించిరి. సరిగదా అవి మనమెరిగిన బైబిలు కంటే వెయ్యి సంవత్సరములు పురాతనమైనవని గ్రహించిరి. ఈ గ్రంధపు చుట్టలలో యెషయా గ్రంధపు చుట్ట ఒకటి యుండెను. యిది పాతనిబంధనలో ఒక పుస్తకము. దానిని మన బైబిలుతో జాగ్రత్తగా పోల్చిచూస్తే దాని భావములో మార్పు యేమీ కలుగని 12 చోట్ల మాత్రమే చాల సూక్ష్మమైన మార్పులున్నట్లు గమనించబడినవి. వెయ్యి సంవత్సరములు మట్టుకు కాపీలు వ్రాయడబడినను, యెషయా గ్రంధములో మార్పేమీ లేకుండా నిలిచి యున్నది" ( Carrell, Page 6 )

ఇప్పుడొక ప్రశ్న : బైబిలు యొక్క ఆదిమ వ్రాత ప్రతులు ఇప్పుడున్నాయా ? లేవు. అయితే ఇప్పుడు మనయొద్ద ఉన్న బైబిలు అక్షరాల ఆదిమ బైబిలు గ్రంధమే యని నిస్సందేహముగా మనం చెప్పవచ్చును. ఇదెలాగ చెప్పగలము ? గ్రంధకర్తయగు కేర్రల్ యొక్క ఉదాహరణ దీనిని వివరించగలదు :

ఒక ధనవంతుడు ఒక వీలునామా వ్రాయించెను. అతని మరణానంతరము తన ధనం సర్వమంతయు వారసులకు పంచి పెట్టబడవలెను. ఈ వారసులు ఆ వీలునామాలో సహజంగా ఆసక్తి గలవారే గనుక వారు ఒక్కొక్కరు దాని నకలును వ్రాయించుకొనిరి. కొంతకాలానికి ఆ ధనవంతుడు మరణించెను. గాని అతని వీలునామా బయటకు తీయబడి అమలుపరచ బడక ముందు, అది భద్రము చేయబడిన కోర్టు భవనము కాలిపోయెను, దానిలోని రికార్డులన్నీ నాశనమాయెను. అప్పుడు వారసుల యొద్దనున్న నకళ్లు తేబడగా వాటిలో అక్కడక్కడా చాల సూక్ష్మమైన మార్పులున్నట్లు గమనించబడెను. ఆదిమ వీలునామా ఇక దొరుకుట అసాధ్యమాయెను. గనుక వారసులందరు తమ తమ నకళ్లను తీసికొని ఒక దానితో నొకటి

పోల్చి చూడ మొదలుపెట్టిరి. కొన్ని నకళ్లలో కొన్ని అంకెలు తప్పుగా కాపీ చేయబడెను. మరి కొన్నిటిలో ఒక మాట వదలి వేయబడెను లేదా వేరొక మాట వ్రాయబడెను. అయితే ఏ రెండు నకళ్లలోను ఒకే పొరబాటు లేకుండెను. ఆ ఇరవై నకళ్లను జాగ్రత్తగా పరిశీలించిన తరువాత వారు పొరబాట్లన్నిటినీ సవరించిరి; చివరకు ఆదిమ వీలునామాలోని షరతులను నిస్సందేహముగా వారంగీకరించిరి. ఏలయనగా ఒకే ఒక్క నకలున్నయితే అది దొంగ దస్తావేజు అయి ఉండవచ్చును, లేదా కాలము గడచిన కొలదీ దానిని మార్పు చేసియుండవచ్చును. గాని ఎవడును ఉన్న నకళ్లన్నిటిలోను అట్టి మార్పును చేయలేడు ( Carrell. Page 6 ).

## బైబిలు వ్రాత ప్రతులు

పైన చెప్పబడిన అంశములో వ్రాత ప్రతులను గూర్చి తలంచాము. ఈ వ్రాత ప్రతులు ఆదిలో వ్రాయబడిన దాని నకళ్లు మాత్రమే. ఇంతకుముందు మనం చూచిన ఉదాహరణలో మొదటి దస్తావేజు యొక్క ఇరవై నకళ్లున్నట్లు గమనించాము. బైబిలు పుస్తకములకయితే వందలకొలది నకళ్లున్నవి. ఈ వందలాది నకళ్లలోను ఉన్న తేడాలు చాల సూక్ష్మమైనవే అయినను విద్యావేత్తలు వాటిని నిశితంగా పరిశీలించి తేడాలను సవరించారు. తత్ఫలితముగా ఆదిమ పరిశుద్ధ గ్రంధము మొదట్లో యున్నట్లే ఇప్పుడును మనము కలిగియున్నాము. ఈనాడు అధునాతన ముద్రణ యంత్రములుండుటచే ఏటేటా బైబిలు యొక్క కొట్లాది పవిత్ర ప్రతులు ముద్రించబడుచున్నవి. అందువలన బైబిలు గ్రంధము యొక్క మూల వాక్యములలోనికి ( Original text ) పొరబాట్లు దొర్లించుట అసాధ్యము.

విద్యావేత్తలు, బైబిలు పండితులు ఈ దిగువ నుదహరించిన కొన్ని పురాతన వ్రాత ప్రతులపై ఆధారపడి తమ పరిశోధన గావించిరి.

**ద వేటికేనస్ ( The Vaticanus )** :ఈ బైబిలు ప్రతి ప్రస్తుతమున్న వ్రాత ప్రతులన్నిటి కంటే పురాతనమైనది. యిది బహుశ క్రీ॥పూర్వము 400

సంవత్సరములో వ్రాయబడియుండెను. అది గ్రీకు భాషలో వ్రాయబడియుండెను. ఆదికాండములో మొదటి 46 అధ్యాయములు, కీర్తనల గ్రంధములో 105నుండి 137 కీర్తనలు మినహాయించి మిగతా పాతనిబంధన అంతయు ఈ ప్రతిలో యున్నది. క్రొత్తనిబంధనలో అది మత్తయినుండి ఆరంభమై హెబ్రీ 9:14వరకు కూడ ఇందులో యున్నది. ఇంచుమించు 2400 సంవత్సరముల పాతదైనను ఈ వ్రాత ప్రతి ఇంచుమించు స్పష్టముగను, చదువశక్యముగను యున్నది. క్రీ॥శ॥ 1481 నుండి ఈ ప్రతి ఇటలీ దేశంలో వేటికన్ పట్టణపు గ్రంధాలయములో ఉంచబడి యున్నది.

ద సైనేటికస్ ( The Sinaticus ) :ఈ వ్రాత ప్రతికూడ క్రీస్తుపూర్వము 400 సంవత్సర కాలములో వ్రాయబడినదే. జర్మనీ విద్యావేత్తయగు టిషెన్‌డోర్ఫ్ (Tischendorf ) చే అది అది 1859వ సంవత్సరములో సీనాయి కొండపైనున్న ఒక ఆశ్రమములో కనుగొనబడెను. అది కూడ గ్రీకు భాషలోనే వ్రాయబడెను. పాతనిబంధన, క్రొత్తనిబంధనలు సంపూర్తిగ ఈ ప్రతిలో యున్నవి. అది ఇప్పుడు బ్రిటీషు మ్యూజియంలో ఉంచబడి యున్నది. గాని దాని అచ్చులు ( Facsimiles) మాత్రము అన్ని గొప్ప గ్రంధాలయములలోను ఉంచబడియున్నవి. గనుక వాటిని ఎవరైనా పఠించవచ్చు, పరిశోధించవచ్చును.

ద అలెగ్జాండ్రినస్ (The Alexandrinus ) : ఈ వ్రాత ప్రతి క్రీస్తు శకము 5వ శతాబ్దపు ఆరంభములో లిఖించబడెను. గ్రీకుభాషలో వ్రాయబడెను. పాతనిబంధన, క్రొత్త నిబంధనలు పూర్తిగా ఇందులో యున్నవి. మనం మొదట చూచిన రెండు పురాతన ప్రతులంత స్పష్టముగా యిదిలేదు. అది ఐగుప్తు దేశములో అలెగ్జాండ్రియా పట్టణములో తయారు చేయబడెను. క్రీస్తుశకము 1627నుండి బ్రిటీషు మ్యూజియంలో అది ఉంచబడి యున్నది.

ఎఫ్రాయీము వ్రాత ప్రతి ( The Ephraem Manuscript ) : యిది కూడ క్రీస్తుశకము 5వ శతాబ్దపు ఆరంభములోనే వ్రాయబడెను. అది అతి విలువైన చర్మకాగితపు పొరలపై (Vellum) వ్రాయబడెను. పాతనిబంధన చాల మట్టుకు

దానిలో యున్నది. 2 థెస్సలోనికయులకు, యోహాను వ్రాసిన 2వ పత్రిక తప్ప క్రొత్తనిబంధన అంతా అందులో యున్నది. అది ఇప్పుడు ఫ్రాన్స్ దేశంలో రోయల్ గ్రంధాలయంలో ఉంచబడి యున్నది.

ఇవియేగాక వందలాది వ్రాత ప్రతులు, ఆదిమ క్రైస్తవ లేఖకులు వ్రాసిన వ్రాతలలో తిరిగి వ్రాయబడిన వేలకొలది లేఖనభాగములుండుటచే, ఆదిమ గ్రంధములో యున్న ఖచ్చితమైన మాటలను మనము నిర్ధారించుకొనవచ్చును.

## బైబిలు భాషాంతరములు
## (Versions of the Bible)

మొదట్లో పాతనిబంధన హెబ్రీ భాషలోను, క్రొత్తనిబంధన గ్రీకు భాషలోను వ్రాయబడెను. అయితే ఇంతకు మందే చెప్పుకొనిన రీతిగా బైబిలు గ్రంధము వెయ్యికంటే ఎక్కువ భాషలలోనికి తర్జుమా చేయబడినది.

క్రీస్తుపూర్వము : క్రీస్తుపూర్వము 285వ సంవత్సరములో డెబ్బదిమంది యూదా విద్యావేత్తలు ఈజిప్టులో అలెగ్జాండ్రియా పట్టణములో మొట్టమొదటిగా బైబిలును అనువదించిరి. అది పాతనిబంధన మాత్రమే. దానిని వారు హెబ్రీ భాషలోనుండి గ్రీకు భాషలోనికి తర్జుమా చేసిరి. దానిని వారు సెప్టూజింట్ (Septuagint) తర్జుమా లేక L XX తర్జుమా (అనగా 70 మందిచే తర్జుమా) అని పిలచిరి. యేసుక్రీస్తు కాలములో వ్యాప్తిజెందియున్న గ్రీకు బైబిలు ఇదియే అయ్యుండవచ్చును. మరియు క్రొత్తనిబంధన లేఖకులు తిరిగి వ్రాసిన బైబిలు వచనములనేకములు ఈ గ్రంధమునుండియే అయ్యుండవచ్చును.

క్రీస్తు తరువాత : (మొదటి శతాబ్దమునుండి 14వ శతాబ్దము వరకు) క్రీస్తుశకము 405లో జెరోమ్ అను విద్యావేత్త బైబిలు తర్జుమాను లేటిన్ భాషలో పూర్తిచేసి దానిని లేటిన్ వల్గేట్ (LATIN VULGATE ) తర్జుమా అని పిలచెను. వెయ్యి సంవత్సరముల వరకు ఈ తర్జుమా విశ్వవ్యాప్తి జెందియుండెను. అది కేథలిక్కుల అధికార పూరిత తర్జుమాగా పేరుగాంచెను. మరియు రీమ్స్ డోవే ( Rheims-Douay ) అను ఇంగ్లీషు తర్జుమా బైబిలు లేటిన్ వల్గేట్ నుండియే చేయబడెను.

ఇంగ్లీషులోనికి తర్జుమాలు : బైబిలును పూర్తిగా ఆంగ్లములోనికి 1382లో ఇంగ్లాండులో జాన్‌విక్లిఫ్ (John wyclif) అనునతడు తర్జుమా చేసెను. అప్పటి వరకు బైబిలు హెబ్రీ, గ్రీకు, లేటిన్ భాషలలో మాత్రమే యుండేది. మరియు కాప్టిక్, అరబిక్, స్లావోనిక్ భాషలలో కూడ యుండేది. విక్లిఫ్ బైబిలునంతటిని చేతితో వ్రాయవలసి వచ్చియుండెను. గనుక బైబిలు విపరీతమైన ఖరీదు గలదియాయెను. లేఖకులు బైబిలును చూచి వ్రాయుటకు ఒక సంవత్సరమైనా పడుతుయుండేది.

15వ శతాబ్దములో ముద్రణ యంత్రము కనుగొనబడిన తరువాత, అచ్చొత్తింపబడిన బైబిలు వ్యాపకమాయెను.

- గ్లూటెన్ బర్గ్ బైబిలు : యిది 1455లో లేటిన్ భాషలో మొట్టమొదటిగా అచ్చు వేయబడిన బైబిలు.
- టిన్‌డేల్ బైబిలు : యిది 1525లో మొట్టమొదటిగా ఇంగ్లీషులో పూర్తిగా అచ్చువేయబడిన బైబిలు.

16వ శతాబ్దపు అంతమునుండి ఇప్పటివరకును కొన్ని వందల తర్జుమాలు చేయబడినవి.

ఇంగ్లీషు తర్జుమాలన్నిటిలో విశ్వ వ్యాప్తమై ప్రజాదరణ పొందిన తర్జుమా కింగ్‌జేమ్స్ తర్జుమా (King James Version) 1611లో తర్జుమా చేయబడెను. ఆంగ్ల ప్రపంచ మంతా ఇంచుమించు 300 సంవత్సరముల మట్టుకు దీనిని ఉపయోగించిరి. నాటినుండి నేటివరకు ఆయా తర్జుమాలలో అనేకమార్లు పునర్విర్శలు ( Revisions ) జరిగినవి. సరిగదా ఆధునిక వాడుక భాషలో కూడా పలు తర్జుమాలు వెలవడినవి. ప్రపంచమంధంతటా ప్రజలు బైబిలును సుళువుగా అర్థము చేసికొనగల్గునట్లు ఈ తర్జునూలు వెలువడినవి.

తెలుగు బైబిలు : క్రీస్తుశకము 7వ శతాబ్దము నాటికే తెలుగు భాషకొక లిపి యేర్పడివట్టు ఆంధ్రదేశము యొక్క చరిత్ర వలన తెలియనగును. దక్షిణభారత దేశమునకు మిషనెరీగా వచ్చిన జెగిస్ బాగ్ అనునతడు బైబిలును తెలుగులోనికి

అనువదించుటకు మొదలిడెను. అతని పనిని షుల్ట్జ్ ( Shultz )అను మరియొక జర్మనీదేశ బోధకుడు కొనసాగించెను. ప్రభువు యొక్క మాదిరి ప్రార్థనను తెలుగు, తమిళం, హిందీ భాషలలోనికి అతడు తర్జుమా చేసెను. ఈస్ట్ ఇండియా కంపెనీలో యున్న కెప్టెన్ డాడ్స్ అను ఒక ఆఫీసరు క్రొత్తనిబంధనలోని కొన్ని పుస్తకములను తెలుగునకనువదించెను. అయితే అతని పని ముగియక ముందే అతడు మరణించెను.

బైబిలును తెలుగునకనువదించుటలో బాప్టిస్టు మిషనెరీలగు విలియమ్‌కేరీ, మార్ష్‌మన్, వార్డ్ లను వారు ముఖ్య పాత్రను వహించి ఎనలేని కృషి సల్పిరి. 1805వ సంవత్సరము నాటికి వారు క్రొత్త నిబంధనను పూర్తిగా తెలుగున కనువదించిరి. విశాఖపట్టణం ప్రాంతమునకు మిషనెరీలుగా వచ్చిన జార్జిక్రాన్, అగస్టస్ డి రేంగ్ అనువారు కూడ అనువదించుటలో గొప్ప కృషి సల్పి 1812 నాటికి క్రొత్తనిబంధనను లెలుగులో ముద్రించిరి. మరియు 1852లో పాతనిబంధన తెలుగులో ముద్రించబడెను. ఆనాటి బ్రిటీషు పాలనలో ICS ఆఫీసరుగా యున్న సి.పి. బ్రౌన్ గారు గొప్ప విద్యావేత్తయు, పలు భాషాప్రవీణుడుగుటచే, బైబిలులోని కొన్ని పుస్తకములను అతడు కూడా తెలుగునకనువదించెను. అతడు ఇంగ్లీషు-తెలుగు డిక్షనరీని తయారు చేసెను. తెలుగు బైబిలు అనేక మిషనెరీల యొక్కయు, విద్యావేత్తల యొక్కయు సమిష్టికృషియై యున్నది. 1911లోను 1952లోను తెలుగు బైబిలు పునర్విమర్శ (revise) చేయబడెను. నాటినుండి తెలుగు బైబిలును అన్ని సమాజముల వారు విరివిగా వాడుచునే యున్నారు (BSI Newsletter)

## ముగింపు

బైబిలు దేవుని నుండి మానవునికి ఎట్లు కలిగెనో అధ్యయనం చేసిన తరువాత, అది దేవుని వాక్యం ఎట్లయ్యిందో అధ్యయనం చేసిన తరువాతను, ఈ లోకమునకు క్రీస్తును పంపించుటకు దేవుడు చేసిన ముందు ఏర్పాట్లను గూర్చి తరువాత పాఠములో తెలిసికొందాము.

- జాషువా గూటం.

ఉదయకాల కూటములో సోదరులు పి.సురేంద్రకుమార్ (మణుగూరు), యన్.నందనం దాస్ (ఇబ్రహీంపట్నం), ఇందుపల్లి ఇశ్రాయేలు (తిరువూరు), కె.రవీంద్రనాద్ (నందిగామ), కె.ఇశ్రాయేలు (కంభంపాడు) గార్లు పై అంశముపై ఆధారపడి చక్కటి వాక్యపరిచర్య గావించిరి. మధ్యాహ్నకాల కూటము సత్తుపల్లి నుండి వచ్చిన సోదరులు రాబర్ట్ విల్సన్ గారి ప్రార్ధనతో ఆరంభము కాగా సోదరులు యమ్.రాజేంద్రప్రసాద్ కుమార్ (పరిటాల), టి.లక్ష్మయ్య (లింగాల), జాషువా గూటం గార్లు వాక్య పరిచర్య చేసిరి. సోదరులు బి.మార్కు గారు సమయోచితమైన క్లుప్త సందేశములనిస్తు సదస్సును ఘనముగాను, మర్యాదకరముగాను అధ్యక్షులుగా నుండి నడిపించిరి.

ఈ లోకంలో సాంఘికముగా గాని, ఆధ్యాత్మికముగా గాని ప్రతివానికి విశ్వాసము అవసరమే. విశ్వాసము లేకుంటే ఒండొరులను నమ్మలేము, సాంఘిక జీవనం, కుటుంబ జీవనం కుంటుబడతాది. అలాగే ఆత్మీయ విషయం వచ్చేసరికి అది మరింత అవసరం. ఏలయనగా, "విశ్వాసము లేకుండా దేవునికిష్టుడై యుండుట అసాధ్యము" అని బైబిలు చెప్పుచున్నది (హెబ్రీ 11:6). యేసును దేవుడు ఈ లోకమునకు పంపెను. ఆయన దేవుని కుమారుడని మనం విశ్వసించు లాగున ఆయన అనేక అద్భుతములు మహత్కార్యములు చేసెను. వాటిని గూర్చి విన్నప్పుడు, లేదా చదివినప్పుడు మనకు విశ్వాసము కలుగును (యోహాను 20:30,31). అయితే రక్షింపబడాలంటే విశ్వాసము ఒక్కటి మాత్రమే చాలునా ? చాలును అని అపవాది ఒక అబద్ధాన్ని ఈ లోకంలో ప్రవేశపెట్టాడు. దానిని ప్రశ్నించకుండగనే మతశాఖల వారందరు ప్రచురము చేయుచున్నారు. పాత నిబంధనలో గాని, క్రొత్తనిబంధనలో గాని దేవుడెవరినైనా ఏమైనా ఆజ్ఞాపిస్తే, వారు ఆయా ఆజ్ఞలకు పరిపూర్ణముగా లోబడితేనే దీవించబడ్డారు. నోవహు దేవుడు చెప్పినట్లు చేసెను. "దేవుడతని కాజ్ఞాపించిన ప్రకారము యావత్తు చేసెను" (ఆది 6:22). ఆలాగే అబ్రహాము, హేబేలు, మోషే మొదలగు విశ్వాస వీరులంతా చేసారు. ఒకని విశ్వాసం పరిపూర్ణం కావాలంటే విధేయత కావాలి.

మనం పాపములనుండి విముక్తులమై రక్షింపబడాలంటే యేసుప్రభువు దేవుని కుమారుడని విశ్వసించాలి, మారుమనస్సు పొందాలి, ఆయన నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొనాలి. పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందాలి. యివి జరిగించినప్పుడే మనం విశ్వాసమునకు విధేయుల మవుతాము. ఒకడు

బాప్తిస్మము పొందిన తరువాతనే రక్షింపబడతాడు గాని అంతకుముందు కాదు. ఏలయనగా "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని" యేసుప్రభువు సెలవిచ్చారు (మార్కు 16:16). యూదులేమి, అన్యజనులేమి సమస్త జనులు విశ్వాసమునకు విధేయులు కావాలని ఆయన కాంక్షించుచున్నాడని (రోమా 16:25), అవిధేయులను ఆయన తప్పక శిక్షిస్తాడని సోదరులు హెచ్చరించారు.

ఈ సువార్తికుల సదస్సు కొరకు కంభంపాడు సువార్తికులు కె.ఇశ్రాయేలు గారు, స్థానిక సంఘము అనేక వ్యయప్రయాసల కోర్చి చక్కటి ఏర్పాట్లు చేసిరి.. వచ్చిన వారందరికీ రుచిగల శుచియైన భోజన పానాదులను ఏర్పాటుచేసిరి. సాయంకాల కూటము కె.బాలస్వామి (కంభంపాడు) గారి ప్రార్థనతో ముగియగా అందరు సంతోషముతో తమ తమ ప్రాంతములకు తిరిగి వెళ్లిరి. కంభంపాడు లోను, పరిసర గ్రామములనేకములలో సోదరులు కె.ఇశ్రాయేలు గారు బలమైన సువార్త పనిని జరిగిస్తు, పలుచోట్ల పటిష్టమైన ఆలయములను నిర్మించి గొప్ప పనిచేయు చున్నారు. వారి పనికొరకు అందరు ప్రార్థించమనవి.

Edited & Published by Joshua Gootam & Printed by him at
Satya Vani Publications, Kakinada - 533 004

PRINTED BOOK - BOOK POST

From:

SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001

To